హంతకుడెవరు? హంతకుడెవరు?

వసుంధర

ధర్మారావు కిళ్ళీకొట్టు దగ్గర ఆగి ఓసోడా కొట్టించుకుని తాగి-"అబ్బ-ఎండలు మండిపోతున్నాయి-" అన్నాడు.

"అవునండి. ఈఏడాది మాబేరాలు కూడా జోరుగానే ఉన్నాయి-"అన్నాడు కొట్టుఆసామీ. ఆ ఆసామీకి డబ్బిచ్చి 'ఈకొట్టు నదిరోడ్డు మీదుంది. ఇక్కడా ఎండలు మండిపోతున్నాయి. కొట్టేమీ ఎయిర్ కండీషన్డుది కాదు. ఆసామీ చెమటలు కక్కేస్తున్నాడు కానీ తను ఒక్క సోడాకూడా తాగడంలేదు. వ్యాపారమంటే ఇదేకాబోలు-' అనుకున్నాడు.

వ్యాపారం గురించి ధర్మారావు అలా ఆలోచించడానికి కారణం లేకపోలేదు.

అతని తమ్ముడు శంకర్రావు వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారం ప్రారంభించి అయిదారు సంవత్సరాలయింది కానీ ఇంతవరకూ దానివల్ల కలిగిన ప్రయోజనం తెలియలేదు.

ధర్మారావు, శంకర్రావు-ఇద్దరూ అన్నదమ్ములు. చాలా అన్యోన్యంగా ఉంటారు. ధర్మారావుకు పెళ్ళయింది. భార్య అనుకూలవతి. ఇద్దరు పిల్లలు. శంకర్రావుకు పెళ్ళిసంబంధాలు వస్తున్నాయి కానీ వ్యాపారంలో స్థిర పడితే తప్ప పెళ్ళిచేసుకోనంటున్నాడు. శంకర్రావుకు పాతికేళ్ళు దాటాయి.

అన్నదమ్ములకు ఉమ్మడిగా పాతికెకరాల మాగాణి ఉంది. ఊళ్ళో రెండిళ్ళున్నాయి. ధర్మారావు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. అది ప్రయివేట్ కాలేజీయే అయినా జీతాలు సక్రమంగానే ఇస్తారు. జీతం కాక ధర్మారావుకు ప్రయివేట్ల రూపేణా ఆదాయం బాగానే వస్తోంది.

శంకర్రావు సంగతే ఎటూ తేలకుండా ఉంది. అత గాడు హైస్కూల్లో సెకండ్‌ఫారం రెండుసార్లు ఫెయిల్ కావడంతో పరువు తక్కువని ప్రయివేటుగా మెట్రిక్ చదివించారు. అది మూడుసార్లు తప్పేక శంకర్రావు మరి పరీక్షలు రాయనని మొండికేశాడు.

ఆ తర్వాత అతడి దృష్టి వ్యాపారం మీదకు పోయింది. ముందేవో అవీ ఇవీ చిల్లర వ్యాపారాలు చేసి చిల్లర దెబ్బలు తిన్నాడు. ఆ సమయంలో ఒక ఏడాది తేడాలో తలిదండ్రులిద్దరూ పోయారు. ఇంటికి ధర్మారావే పెద్ద అయ్యాడు.

ధర్మారావు ఇంటి పెద్దకావడం శంకర్రావుకు ఇంకా లాభించింది. స్వతహాగా ధర్మారావు మెతకమనిషి. అత నికి తమ్ముడంటే వల్లమాలిన అభిమానం. శంకర్రావుకు అన్న దగ్గర బాగా చనువుంది.

"చిల్లర వ్యాపారాలు చేసి చిల్లర దెబ్బలు తిని దబ్బుకోలేదింక-" అన్నాడు శంకర్రావు అన్నతో.

"అంటే పెద్దవ్యాపారంచేసి పెద్ద దెబ్బతినాలనా?" అన్నాడు ధర్మారావు నవ్వి.

"వ్యాపారం చేస్తే దెబ్బతినడ మొక్కటే నను కున్నావా?" అన్నాడు శంకర్రావు కోపంగా.

"పరీక్షలు రాస్తే ఫెయిలవడమూ, వ్యాపారాలుచేస్తే దెబ్బతినడమూ- ఇదే కదా నీ రివాజు''

"అలా అనకు అన్నయ్యా- ఒక్క అయిదువేలియ్యి- రెండేళ్ళలో లక్షాధికారిని అవుతాను-"

ధర్మారావు నవ్వి- "సరే - తీసుకో-" అన్నాడు. ఏం వ్యాపారమని అతను అడగలేదు. శంకర్రావూ చెప్పలేదు. డబ్బుతీసుకొని శంకర్రావు వెళ్ళిపోయాడు.

గత అయిదు సంవత్సరాలుగా అతను ఇంట్లో ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. పండుగలకూ అప్పుడూ తమ్ముడికి బట్టలుకూడా ధర్మారావే తీయించేవాడు. వ్యాపారం ఇబ్బందుల్లో ఉన్నదని ధర్మారావు దగ్గర శంకర్రావు అప్పుడప్పుడు డబ్బు తీసుకుంటూండేవాడు. ఆ విధంగా ఆ వ్యాపారం మీద ఇప్పటి వరకూ పాతిక వేల వరకూ ఖర్చయింది.

"ఇలాడబ్బయిస్తే అతను పాడై పోతాడండీ- అసలేం చేస్తున్నాడో తెలుసుకోండీ" అంటూ శాంత ఒక పర్యాయం భర్తను మందలించింది.

"వాడి గురించి నాకు తెలిసిందల్లా ఒక్కటే. వాడికే దురలవాట్లూ లేవు. ఆఖరికి సిగరెట్ కూడా తాగడు. క్లబ్బులమ్మట తిరగడంలేదు. పేకాడి డబ్బు తగలే

యడంలేదు. అంతవరకూ హామీ ఇవ్వగలను నేను''- అన్నాడు ధర్మారావు.

“హామీ నా కివ్వడమెందుకూ- అతడు చెడిపోతాడన్న భయం కొద్దీచెప్పాను. ఈ వయసులో బాధ్యతలు తెలియకపోతే కష్టంగదా-” అంది శాంత.

“శాంతా! ప్రస్తుతం వాడు చేస్తున్నఖర్చు వాడి ఆస్తిమీదవచ్చే ఆదాయం కంటే తక్కువగానే ఉంది. వాడు మరీ దుబారాగా ఉంటే తప్పకవారించే వాణ్ణి. ఆ తర్వాత వాడికేమీ లేకపోయినా వాణ్ణి జీవితాంతం పోషించగల శక్తి మనకుంది. అందుకే వాడిగురించి నేనంతగా బెంగపెట్టుకోలేదు. ప్రస్తుతం వాడిరోజులు బాగాలేవు. అందుకని వ్యాపారంలో అట్టే పైకిరాలేకపోతున్నాడు. ఏదో ఓరోజున అదృష్టం తన్నుకువచ్చి వాడు చాలాగొప్పవాడై పోతాడు. ఇది తప్పక జరుగుతుంది-” అన్నాడు ధర్మారావు.

భర్త మాటల్లో శాంతకూ సబబు కనిపించింది. మరిది గురించి మరీ అంత ఇదై పోవలసిన అవసరం లేదని ఆమె గ్రహించింది.

అయితే శంకర్రావు వాళ్ళ అంచనాలను తారుమారు చేశాడు. నెలరోజుల క్రితం శంకర్రావు ఇంట్లో చాలా దిగులుగా కనిపించాడు. విషయమేమిటని అడిగితే ఓ పట్టాన చెప్పలేదు. బాగా రెట్టించి అడగ్గా-“జీవితంలో వేయకూడని తప్పటడుగే వేశాను. రెండు మూడు నెలల్లో వ్యాపారం పుంజుకునే అవకాశం ఏర్పడిందనుకొనేటంతలో ఈ ఇబ్బంది వచ్చింది.” అన్నాడు.

“నీ మాటలు నాకర్థం కావడం లేదురా. వివరంగా

చెప్పరా''-అన్నాడు ధర్మారావు.

"నా మాటలు నీ కర్థం కాకూడదన్నయ్యా - అర్థం చేసుకోవడానికూడా ప్రయత్నించ వద్దు. నేను చిక్కుల్లో పడ్డాను. అవి నీవల్ల తీరేచిక్కులు కావు. ఎలా వాటిలో పడ్డానో అలాగే వాటిలోంచి బయట పడ్డానికి ప్రయత్నిస్తాను. కనీసం అంతకాలం మీరు నా గురించి పట్టించుకోకండి-" అన్నాడు శంకర్రావు.

తమ్ముణ్ణి నొక్కించి ఏ విషయమూ అడగడం చిన్నప్పట్నించీ ధర్మారావుకు అలవాటు లేదు. అందువల్ల అతడికి తమ్ముడి గురించి బెంగగా ఉంది. తమ్ముడి చిక్కులన్నింటికీ వ్యాపారం పిచ్చి కారణమని తెలియడం వల్ల ఎక్కడైనా ఎవరైనా చక్కగా వ్యాపారం చేసుకుంటూంటే చూసి నిట్టూరుస్తుంటాడతను. ఎక్కడ ఎవర్ని చూసినా చక్కగా వ్యాపారం చేసుకుంటున్నట్లే కూడ అతడికి అనిపిస్తుంది.

ప్రస్తుతం ధర్మారావు తన బావమరిది ఇంటికి బయల్దేరాడు.

ధర్మారావు బావమరిది రమణమూర్తి ఆ ఊళ్ళోనే ఉంటున్నాడు. అతనికా ఊళ్ళో పేరున్న ప్రెస్ ఉంది. వ్యాపారం చక్కగా నడుస్తున్నా రమణమూర్తి ఎక్కువగా ఇంట్లోనే కాలం గడుపుతూంటాడు.

అతను కాస్త కులాసా పురుషుడు. బ్రతికిన నాలుగు రోజులు ఏ బాదరా బందీ లేకుండా హాయిగా జీవించాలంటాడు. అలా అని చెప్పుకోదగ్గ దురలవాట్లేమీ అతనికి లేవు. కొడుకు పుట్టు వెంట్రుకలు తీయించే కార్యక్రమం ఒకటుంది. ఆ విషయంలో కుర్రాడి మేనమామతో

సంప్రదిద్దామని ఇప్పుడు ధర్మారావు అక్కడికి బయల్దేరాడు.

సోడా తాగి కొంతదూరం నడిచేక ధర్మారావుకు ఒక ఇంట్లోంచి హడావుడిగా బయటకు వస్తున్న తమ్ముడు శంకర్రావు కనబడ్డాడు.

"ఒరేయ్ శంకర్రావ్-" అని గట్టిగా పిలిచాడు ధర్మారావు. శంకర్రావు ఆ పిలుపు విననివాడిలా అక్కణ్ణించి హడా విడిగా వెళ్ళిపోయాడు.

ధర్మారావుకు ఆ ఇల్లెవరిదో తెలుసు. ప్రముఖ కాబరే నర్తకి మేనకది ఆ ఇల్లు. ఆమె అసలు పేరు మేనక కాదు. కానీ నర్తకిగా ఆ పేరుతోనే వ్యవహరించబడు తుందామె. అందచందాలలో, అవయవ పుష్టిలో ఆమెకు అప్సరసలు కూడా దీటురారని అంతా చెప్పుకుంటారు. తన అందాన్ని డబ్బు సంపాదించుకోవడానికామె వినియో గిస్తున్నట్లు జనం అంటారు.

ఇప్పుడు శంకర్రావు బయటకు వచ్చిన ఆ బంగళా చూడ్డానికి చిన్నదే కానీ అందులో లేని సదుపాయాలుండ వంటారు. దాని ఖరీదు పదిహేను లక్షల వరకు ఉంటుందని అంచనా. ఆ బంగళా ఎంత పలుకుబడిగలది అంటే అక్కడ ఉన్న సిటీబస్ స్టాప్‌ను చాలామంది "మేనక బంగళాస్టాప్!" అంటారు.

ధర్మారావు ఆలోచనలు పేరు. శంకర్రావు ఆ బంగళా లోంచి ఎందుకు వస్తున్నాడు? అతడికి ఆ బంగళాలో పని ఏమిటి? మేనకకూ అతడికీ ఉన్న పరిచయం ఎలాంటిది? శంకర్రావు ఇప్పుడెదుర్కొంటున్న సమస్యలకూ మేనకకూ సంబంధం ఉందా?

ఒక్క ప్రశ్నకూడా ధర్మారావుకు జవాబు

దొరక లేదు.

2

ధర్మారావు వెళ్ళేసరికి రమణమూర్తి ఇంట్లోనే ఉన్నాడు. అతనూ మరొకతనూ కలిసి చదరంగం ఆడు తున్నారు. ధర్మారావు కూడా చదరంగం అంటే మంచి ఆసక్తి. అతను వెళ్ళేసరికి ఆటమంచి పట్టులో ఉంది.

"కూర్చో బావా!" అన్నాడు రమణమూర్తి.

ధర్మారావు తనూ ఓకుర్చీ లాక్కొని కూర్చుని "అర్జంటు విషయం కాదులెండి. ఆట ఆపకండి" అన్నాడు ఇద్దర్నీ ఉద్దేశించి.

ఇద్దరూ సీరియస్‌గా ఆడుతున్నారు. ఒక పరిస్థితిలో ధర్మారావు చూస్తు ఊరుకోలేక అపరిచిత వ్యక్తిని ప్రమాదము నుంచి హెచ్చరించి చిన్న సూచన ఇచ్చి రమణమూర్తి వంక చూసి "సారీ!" అన్నాడు.

"పరేం ఫరవాలేదు. ఇద్దరి మీద ఆడుతుంటే నాకు చాలా సంతోషం" అన్నాడు రమణమూర్తి

అపరిచిత వ్యక్తి ధర్మారావు చెప్పిన ఎత్తులో రమణ మూర్తి గుర్రాన్ని తీసుకున్నాడు. రమణమూర్తి ఆట ఇబ్బందిలో పడింది.

"అనుకోకుండా మీరు నాకుసాయపడి మీవాడిగుర్రాన్ని చంపడానికి సహకరించారు" అన్నాడు అపరిచిత వ్యక్తి.

"బావా-నీవాడికి నువ్వు వ్యతిరేకంగా సలహాలివ్వటం బాగోలేదు." అన్నాడు రమణమూర్తి నవ్వుతూ. ఆ ఎత్తు నుంచి తప్పించుకోవడానికి అతనికి చాలా సేపు పట్టింది.

మొత్తం మీద ఆట డ్రా అయింది.

"రమణా- శంకర్రావు నీ దగ్గరకు తరచూ వస్తూం టాడు కదా! వాడి వ్యాపారానికీ మేనక బంగళాకూ ఏమైనా సంబంధముంటుందంటావా?" అన్నాడుధర్మారావు.

"ఇదేం అనుమానం ?" అన్నాడు నవ్వుతూ రమణ మూర్తి.

అపరిచితుడు నవ్వి "మీరు నాకు ఆటలో సాయం చేశారు కాబట్టి చెబుతున్నాను. మేనక బంగళాతో సంబంధ మున్న వ్యాపారస్థులందరూ నాకు తెలుసు. ముందు ఆ శంకర్రావెవరో చెప్పండి!" అన్నాడు.

"అన్నట్లు నేను మీ ఇద్దరికీ పరిచయాలే చేయలేదు కదూ. ఈయన మా బావ-నా చెల్లెల్ని పెళ్ళి చేసుకోక ముందునించీ కూడా పేరు ధర్మారావు అని అపరిచితుణ్ని ధర్మారావుకు చూపిస్తు-'ఈయన ఇన్స్పెక్టర్ భానోజీరావు స్నేహం అనే పదానికి అసలు అర్థం ఈయన వల్లనే నాకు తెలిసింది.' అన్నాడు.

"ఇప్పుడు చెప్పండి - శంకర్రావెవరో ?" అన్నాడు భానోజీరావు.

అతను పోలీసు ఇన్స్పెక్టరని తెలియగానే ధర్మారావు క్కాస్త భయం వేసింది. కొద్దిగా తటపటాయించాడు. ఈలోగానే రమణమూర్తి—'శంకర్రావు ధర్మారావు గారి ఏకైక సోదరుడు' అన్నాడు.

"అయ్యసీ- ఆయనేం వ్యాపారం చేస్తూంటారు?" అన్నాడు భానోజీరావు.

"నిజం చెప్పాలంటే నాకేమీ తెలియదు. వాడిది వచ్చీ రానివ్యాపారం. కొంత డబ్బుతీసుకుని వ్యాపారం పేరుతో

తగలేస్తూవుంటాడు. వాడేం వ్యాపారం చేస్తూంటాడో తెలియదు కానీ కొద్దికాలంగా దిగులుగా కనబడుతున్నాడు. వాడేమైనా చిక్కుల్లో పడ్డాడేమోనని అనుమానంగా ఉంది అనుకోకుండా మీ పరిచయం లభించింది. మావాడి వివరాలు చెబుతాను. వాడి గురించి తెలుసుకోగలరా ?" అన్నాడు ధర్మారావు.

"నేను ప్రయివేట్ డిటెక్టివ్‌ను కాననుకోండి. కానీ అటు వ్యాపారరీత్యా కానీ, ఇటు నేరాలరీత్యా కానీ ఇటీవల నేనెప్పుడూ శంకర్రావు పేరు విని ఉండలేదు. మేనక కస్టమర్ల పేర్లు చాలావరకూ నాకు తెలుసు. అందులో శంకర్రావు పేరులేదు. ఎటొచ్చీ ఆమె దొంగ కాదా, మీ తమ్ముడి వ్యాపారానికీ ఏమైనా సంబంధ ముంటుందని ఎందుకు భావిస్తున్నారు ?" అన్నాడు భానోజీరావు.

ధర్మారావు క్షణం మాత్రం తటపటాయించి— 'ఇక్కడికి వచ్చేముందు నేను వాడిని ఆ బంగళాలోంచి వస్తూండగా చూశాను—'' అన్నాడు.

"టైము చెప్పగలరా?" అన్నాడు భానోజీరావు.

"పదిం పావు అవుతుంది-" అన్నాడు ధర్మరావు.

"సరేలెండి. నేను మేనక దగ్గర్నుంచి వివరాలు సంపాదించడానికీ సమాచారం చాలు. మీకు తప్ప కుండా నాకు తెలిసిన విషయాలు అందజేస్తాను ...." అంటూ భానోజీరావు లేచాడు.

"కాసేపు కూర్చో-" అన్నాడు రమణమూర్తి.

"ఇంటివద్ద ఇల్లాలు ఇప్పటికే కారాలూ మిరియాలూ నూరుతూ ఉంటుంది. అవి ఏకూరల్లోనూ వేయకుండా

చూసోక్కవాలి....” అన్నాడు భానోజీరావు.

అతను వెళ్ళిపోయాక- “నేను కానీ తొందరపడి వ్యక్తిగత విషయాలు నీ స్నేహితుడికి చెప్పలేదుగదా అని భయపడుతున్నాను. పోలీస్ ఇనస్పెక్టరు అనగానే నా బాధ ఆయనకు చెప్పుకోవాలనిపించింది. శంకర్రావు కొన్నాళ్ళగా చాలా దిగులుగా ఉంటున్నాడు-” అన్నాడు ధర్మారావు.

“భానోజీరావు మన మనిషి. అందువల్ల మన వ్యక్తిగత విషయాలు విస్పంకోచంగా అతనికి చెప్పుకోవచ్చు. అందువల్ల ప్రమాదమేమీ లేదు. పైగా మనవాడేదైనా ప్రమాదంలో ఉంటే కాపాడతాడు కూడా-”

“అది నిజమేననుకో- కానీ తమ్ముడెందుకు దిగులుగా ఉంటున్నాడో నాకంతు పట్టడంలేదు. కొంపదీసి ఏదైనా నేరాల్లో ఇరుక్కోలేదు గదా అని బెంగగా ఉంది-” అన్నాడు ధర్మారావు.

“అలాగైనా ఫరవాలేదు. శంకర్రావుకి నేరాలు చేసే ధైర్యంలేదు. పొరపాటున ఎందులోనైనా ఇరుక్కుంటే ఆ వలయం నుంచి భానోజీరావు వాణ్ని రక్షిస్తాడు-” అన్నాడు రమణమూర్తి.

తర్వాత ఇద్దరూ సంభాషణను ఇతర విషయాలపై మళ్ళించారు. ఆ తర్వాత పుట్టినరోజు కల కార్యక్రమం గురించి ప్రస్తావించారు. తనకు ఏతేదీ అయినా అనుకూలమేనన్నాడు రమణమూర్తి.

“అలాకాదు. రేపురాత్రికి మీరు మాయింటికి రండి. అంతా కలిసి కాసేపు సరదాగా గడుపవచ్చు. నువ్వూ మీ చెల్లాయ్ కలిసి మాట్లాడుకుని కార్యక్రమం ఏర్పాటు

చేయండి. కాస్త ఘనంగా చేయాలని మీ చెల్లాయ్ అనుకుంటోంది-" అన్నాడు ధర్మారావు.

రమణమూర్తి ఏదో అనబోతూండగా వీధిలో జీపు ఆగినశబ్దమైంది. మరుక్షణంలోనే లోపలికి ఖానోజీరావు వచ్చాడు.

"ఏమిటోయ్ విశేషం-ఇలా వెళ్ళి అలా వచ్చావ్ !" అన్నాడు రమణమూర్తి.

"విశేషమే మరి-అందుకే యూనిఫాం వేసుకోకుండా ఇలా వచ్చాను....'' అన్నాడు ఖానోజీరావు.

"ఏమిటి అంత గొప్ప విశేషం ?" అన్నాడు రమణమూర్తి.

"హూష్ !'' అన్నాడు ఖానోజీరావు. అతనా ఇద్దర్నీ సమీపించి-"మేనక బంగళాలో పదిగంటల ప్రాంతంలో ఒక హత్య జరిగింది....'' అన్నాడు.

"ఆఁ'' అన్నాడు ధర్మారావు. భయంతో అతని శరీరం వణక సాగింది.

"మీరేమీ భయపడకండి ధర్మారావు గారూ - నేను మిమ్మల్ని ఇక్కడికి భయపెట్టడానికి రాలేదు. తెలిసినవాడుగా సలహా ఇవ్వడానికి వచ్చాను. ఆ బంగళాలోంచి మీ తమ్ముడు శంకర్రావు పదింపావు సమయంలో బయటకు వస్తూండగా మీరు చూశానన్నారు. ఈ విషయాన్ని నేను రహస్యంగా ఉంచుతాను. మీరూ రహస్యంగా ఉంచాలి. మా పరిశోధనకు అది ముఖ్యమైన విషయం కానంతవరకూ ఫరవాలేదు. అయితే మాత్రం నేను మీకు సాయపడలేను. ఇది చెప్పడానికే వచ్చాను-'' అని వెళ్ళిపోయాడు ఖానోజీరావు.

ధర్మారావు, రమణమూర్తి నోట మాట రాక ఒకరి వంక ఒకరు చూస్తూ అలా నిలబడి పోయారు.

3

ధర్మారావు తిరిగివెళ్ళేటప్పుడు మేనక బంగళా మీంచే వెళ్ళాడు.

మేనక బంగళా దగ్గర చాలా హడావుడిగా ఉంది. ఇంటిముందు పోలీసులున్నారు.

"ఏం జరిగింది ?" - ధర్మారావు గేటుదగ్గర ఒక వ్యక్తిని ప్రశ్నించాడు

"హత్య !" అన్నాడావ్యక్తి.

"ఎవరు ఎవరిని చంపారు ?"-ధర్మారావు మళ్ళీ అడిగాడు.

"చచ్చిందెవరో తెలియదు. చంపిందెవరో తెలియదు ...." అన్నాడావ్యక్తి.

"మేనక ఇంట్లో మేనకకు తెలియని మనుషులుంటారా ?"-ధర్మారావు మళ్ళీ అడిగాడు.

'అసలు మేనక ఊళ్ళోలేందే-ఆవిడ బొంబాయిలో ఉన్నదట - అర్జంటుగా బయల్దేరి రమ్మనమని ఆమెకు టెలిగ్రాం ఇచ్చారట-"

ధర్మారావు అక్కడున్న వారినడిగి హత్యగురించిన సమాచారం చాలా సేకరించాడు.

మేనక ప్రస్తుతం ఊళ్ళోలేదట. ఇంటికి వేరే కాపలా మనిషిలేడట.

హతుడాయింట్లో ఎలా ప్రవేశించాడో తెలియదు.

హంతకుడక్కడికి ఎందుకు వెళ్ళాడో తెలియదు. ఉదయం పోస్టుమన్ ఉత్తరాలివ్వడానికి వెడితే ఆశ్చర్యంగా తలుపులు బార్లాతీసి ఉన్నాయట. ఎదురుగా శవం కన్పిస్తున్నదట. అతడు కేకలుపెట్టగా నలుగురూ పోగయ్యారు. తర్వాత పోలీసులు వచ్చారు.

హంతకుడు మేనకకు బాగా తెలిసినవాడయుంటాడనీ అతను ఈ ఇంటి రహస్యంకూడా తెలిసినవాడయుంటాడనీ పోలీసులు భావిస్తున్నారు. ఇప్పుడందర్నీ వేధిస్తున్న సమస్య లేమిటంటే - హతుడెవరు? హంతకుడెవరు? హత్య ఎలా జరిగింది?

ధర్మారావు అక్కడ ఆగలేదు. అతడి మనసు అల్లకల్లోలంగా ఉన్నది. హతుడు, హంతకుడు ఎవరో తెలిసి ఉంటే అతను స్వేచ్ఛగా ఊపిరిపీల్చుకుని ఉండేవాడు. కానీ ఇప్పుడు హంతకుడింకా తెలియదు. అంటే అనుమానితుల జాబితా ఒకటి తయారవుతుంది. ఆ జాబితాలో తమ్ముడిపేరు కూడా ఉంటుంది.

ధర్మారావు ఇంటికి వెళ్ళేసరికి అతను ఆశ్చర్యపోయే విధంగా అక్కడ శంకర్రావు ఉన్నాడు. తమ్ముణ్ణి చూస్తూనే అతడికి చాలా సంతోషంగా ఉంది.

"ఎక్కడికెళ్ళావ్-పొద్దున!" అని అడిగాడు ధర్మారావు.

"ఓస్నేహితుడింటికి-" అన్నాడు శంకర్రావు.

"ఎవరా స్నేహితుడు?" అనడిగాడు ధర్మారావు.

శంకర్రావు మాట్లాడలేదు.

"ఇలారా"-అన్నాడు ధర్మారావు. శంకర్రావు అన్నను సమీపించాక తన స్వరం తగ్గించి-"ఉదయం పదింపావుకు

నిన్న మేనక బంగళానుంచి బయటకు వస్తూండగా చూశాను. అక్కడేంపని నీకు ?" అన్నాడు ధర్మారావు.

"నేనా ? మేనక బంగళా లోంచా ? అసలు నేనా ప్రాంతాల సంచరించందే-ఎవర్నిచూసి ఎవరను కున్నావో నువ్వు !'' అన్నాడు శంకర్రావు. తలని ముఖం చూస్తుంటే అబద్ధం చెపుతున్నాడనిపించలేదు.

"నా కళ్ళారా చూశాను. నువ్వే. అందులో సందేహం లేదు-" అన్నాడు ధర్మారావు.

"భలేవాడివే-అక్కడ నాకేం పని ?" అన్నాడు శంకర్రావు నవ్వుతూ.

తమ్ముడి నవ్వు చూస్తూంటే అతన్ని అనుమానించా లని పించలేదు ధర్మారావుకి. అయితే తనకళ్ళు తననే మోసం చేస్తాయా ?

"అలా తేలిగ్గా నవ్వేయకు. మేనక బంగళాలో ఆ సమయంలోనే ఒక హత్య కూడా జరిగింది -" అన్నాడు ధర్మారావు.

శంకర్రావు ఆశ్చర్యంగా-"హత్యా ! మేనక బంగ ళాలోనా ? కొంపదీసి ఎవరైనా మేనకను చంపేయ లేదుగదా-" అన్నాడు.

ధర్మారావుకేం మాట్లాడాలో తోచలేదు. తమ్ముడి వాటం చూస్తే అసలు ఏ విషయమూ తెలియనట్లుంది. ఒకవేళ అతను వెళ్ళిన సమయానికింకా హత్య జరుగ లేదేమో ? ఆ సంగతి తర్వాత ఆలోచించవచ్చు. అసలు తమ్ముడికా బంగళాలో ఉన్న పనేమిటి ?

"నీకు నిజంగా తెలియదా ?" అన్నాడు ధర్మారావు కోపంగా.

"అదేంటన్నయ్యా అలా మాట్లాడతావు? మేనక బంగళాలో హత్య జరిగితే ఉదయం నుంచీ ఆ ప్రాంతాలైనా మసలనివాడిని-నాకేం తెలుస్తుంది?" - అన్నాడు శంకర్రావు.

తమ్ముడు చెప్పింది నిజమే-అయితే అతను నిజంగా మేనక బంగళాకు వెళ్ళలేదా?

4

"మీ తమ్ముడి వేలిముద్రలు కావాలి।" అన్నాడు భానోజీరావు ధర్మారావుతో.

"అంటే మీరు నా తమ్ముణ్ణి అనుమానిస్తున్నారా?" అన్నాడు ధర్మారావు.

"లేదు. ఇది కేవలం నా రహస్యపరిశోధన కోసం మాత్రమే. ప్రస్తుతం కేసు చాలా గజిబిజిగా ఉంది. హంతుకెవరో తెలియదు. అతదు మేనక బంగళాకెందుకు వచ్చాడో తెలియడం లేదు బంగళాలో మేనక లేదు. బొంబాయిలో ఆమె పేరెవొట్స్ తెలియడం లేదు. చనిపోయేముందు హతుడు హంతకుడితో పెనుగులాడాడు. అక్కడ చాలా ప్రాంతాల్లో రెండురకాల వేలిముద్రలు వున్నాయి. ఒకటి హతుడివి. రెండోవి హంతకుడివయుండాలి. అనుమానితుల జాబితా నుంచి మీ తమ్ముణ్ని పూర్తిగా తొలగించడానికిదొక్కటే ఉపాయం."

పైకి అనలేదు కానీధర్మారావు మనసులో బెరుకుగానే ఉంది. కొంపదీసి ఆ వేలిముద్రలు తమ్ముడివే అయితే?

ఆయితే .... వాడే హంతకుడౌతాడు।

ధర్మారావు శరీరం భయంతో వణికింది. ఏది ఏమైనా వాడొక ఊబిలో ఇరుక్కున్నాడు. అందులోంచి బయట పడడం కష్టం. తనకు చేతనైనంత వరకూ పోలీసులకు సహకరించక తప్పదు. తమ్ముడు నిర్దోషి అయితే భగవంతుడే వాణ్ని రక్షిస్తాడు.

భానోజీరావు వెళ్ళిపోయాక ధర్మారావు చాలాసేపు తమ్ముడి గురించి ఆలోచించాడు.

ఆ రాత్రి ఎనిమిది గంటల ప్రాంతాన శంకర్రావు ఇంటికి వచ్చాడు.

"ఎక్కణ్నుంచి వస్తున్నావ్?" అనడిగాడు ధర్మారావు.

శంకర్రావు అదోలా నవ్వి- "స్నేహితుడి ఇంటి నుంచి-" అన్నాడు.

''ఒరేయ్ శంకరం- నీకేదో ఇబ్బంది వచ్చిందన్నావ్ అదేమిటో చెప్పకూడదురా...." అన్నాడు ధర్మారావు.

"అవినీకు చెప్పుకునే ఇబ్బంది కాదన్నయ్యా అందుకు నాపాట్లేవో నే పడుతూనే ఉన్నాను. ఒకటి రెండు రోజుల్లో అన్ని సమస్యలూ తీరిపోతాయి నాకు-" అన్నాడు శంకర్రావు.

తమ్ముడి మాటల్లో అపశకునం ధ్వనించింది ధర్మారావుకు. అతనింక శంకర్రావుతో మాట్లాడకుండా ఊరుకున్నాడు. భానోజీరావు చెప్పిన సూచనలు దృష్టిలో ఉంచుకుని తమ్ముడు మంచినీళ్ళు తాగిన గ్లాసు ఒకటి జాగ్రత్తచేసి మర్నాటికి దాన్ని-ఇన్‌స్పెక్టర్‌కి అందించాడు.

"మీరీవిధంగా నాకు సహకరించడంవల్ల మీతమ్ముడి పేరు బయట పెట్టకుండానే నాపరిశోధన కొనసాగించ

గల్గుతున్నాను....” అన్నాడు భానోజీరావు ధర్మారావును మెచ్చుకుంటూ.

“నాతమ్ముడు నిర్దోషి అవి తెలుసుకోడానికి ఎంత కాలం పడుతుంది. ?” అన్నాడు ధర్మారావు.

“సాయంత్రంనికల్లా చెప్పేస్తాను....” అన్నాడు భానోజీరావు.

ధర్మారావు అసంతృప్తిగా ఇంటికి వెళ్ళిపోయాడు. అతనికి బొత్తిగా సమయం గడవడంలేదు. అవి వేసంగి సెలవులు కావడంవల్లపోనీ కాలేజీకి వెడదామనుకుందుకూ లేదు. ఎలాగో బిగబట్టుకుని కూర్చున్నాడు. భర్త రోజంతా అదోరకంగా ఉండడం గమనించిన శాంత కారణమేమిటని అడిగింది కానీ ధర్మారావు ఆమెకేమీ చెప్పలేదు.

సాయంత్రం నాలుగుగంటలకు ఉండబట్టలేక ధర్మారావు తనే బయల్దేర బోయాడుకానీ-అతనికి గుమ్మంలోనే రమణమూర్తి ఎదురయ్యాడు. అతని ముఖంలో చాలా కంగారు కనబడుతోంది.

“ఏమిటిలా వచ్చావ్ ?”-అన్నాడు ధర్మారావు ఆత్రుతగా.

‘భానోజీరావు నాకు కబురు చేశాడు....’ అన్నాడు రమణమూర్తి.

‘ఏమని ?’-అన్నాడు ధర్మారావు రెట్టించిన కంగారుతో.

‘అర్జంటుగా నిన్ను తీసుకు రమ్మనమని....’

ధర్మారావు మనసు కీడును శంకించింది. ఆ వేలి ముద్రలు తప్పక శంకర్రావువే అయుంటాయి. అందుకే అతను తనకోసం కబురు పంపించాడు-ఇప్పుడేం చేయాలి?

'ఎందుకో నీకు వివరం చెప్పాడా?' అన్నాడు ధర్మా రావు.

'లేదు. మనిద్దర్నీ కలిసి రమ్మన్నాడు....చాలా ముఖ్య మైన విషయం చర్చించాలట....'

ధర్మారావు కళ్ళు తిరిగాయి. నెమ్మదిగా-'సరేపద!' అన్నాడు.

ఇద్దరూ భానోజీరావు ఇంటికి వెళ్ళారు.

వీళ్ళిద్దరూ తన పర్సనల్ గదికి రాగానే గది తలుపులు వేశాడు భానోజీరావు. ధర్మారావు అతనివంక ఆత్రుతగా చూశాడు.

'నాకిప్పుడు విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. జరిగిం దానికి సంతోషించాలో, విచారించాలో తెలియడం లేదు. ఆవేలి ముద్రలు మీతమ్ముడివే!' అన్నాడు భానోజీరావు.

"ఏం వేలిముద్రలు?" అన్నాడు రమణమూర్తి.

భానోజీరావు వివరంగా కథ చెప్పాడు. రమణ మూర్తి తెల్ల ముఖం వేశాడు. ధర్మారావు ఉన్నవాడున్న పళంగా చతికిలబడి పోయాడు.

"ఆరోజు మీ తమ్ముణ్ణి మేనక బంగళాలోంచి వస్తూం డగా మీరు చూసి ఉండకపోతే హంతకుడి ఆచూకీ మాకు తెలిసే అవకాశం ఉన్నట్లు లేదు. మీకు తెలియ కుండానే మీరు నాకు సహకరించారు...." అన్నాడు భానోజీరావు.

ధర్మారావుకు భానోజీరావుకు ఇదివరలో తను చదరం గం విషయంలో సాయపడ్డట్లు గుర్తుకువచ్చింది. హత్య కేసు సాధించినఘనత భానోజీరావుకు దక్కుతుంది కానీ తను తోడబుట్టిన వాణ్ణి కోల్పోతున్నాడు. విషయం తనకు

ఏ మాత్రం ముందుగా తెలిసినా ఎంతో జాగ్రత్తపడి ఉండేవాడు.

"చూస్తూ చూస్తూ హంతకుణ్ని దాచలేరు గదా-ఎంత రక్తసంబంధమైనా సరే-నేరాల దగ్గర మరిచి పోవడం మంచి పౌరుల బాధ్యత-" అన్నాడు భానోజీరావు.

"అయితే నాతమ్ముడే హంతకుడని రూఢి చేశారా?" అన్నాడు ధర్మారావు.

"అంతే అయుండాలి మరి! కాని పక్షంలో హత్య గురించిన అపూర్వ రహస్య వేదైనా తెలిసైనా ఉండాలి...." అన్నాడు భానోజీరావు.

"రెండోదే నిజమయ్యుంటే బాగుండును..."అన్నాడు ధర్మారావు.

"అదే నిజమైతే నేనూ సంతోషిస్తాను. మన మంతా ఒక పర్యాయం మీ తమ్ముణ్ని కలుసుకుని మాట్లాడాలి. అతని చేత అసలు విషయం చెప్పించాలి.... ఈ రాత్రికి మీ యింట్లో సమావేశ మౌదామా? నేను యూనిఫాం లేకుండా వస్తాను. నేనెవరో ఇంట్లో చెప్పవద్దు-" అన్నాడు భానోజీరావు.

ఆ సమయంలో భానోజీరావు దేవుడని పించింది ధర్మారావుకు.

5

"మీరంతా నన్నెందు కనుమానిస్తున్నారో తెలియదు. నేను అమాయకుణ్ని-" అన్నాడు శంకర్రావు.

"బుకాయించడానికి ప్రయత్నించవద్దు. ఆ భగవం తుడే దిగి వచ్చినా నిన్నిప్పుడు రక్షించలేడు. నువ్వు అమాయకుడివే అయితే ఏ కారణంగా మేనక బంగళాకు వెళ్ళావో అక్కడ నువ్వేమి చూశావో నాకు చెప్పాలి-" అన్నాడు భానోజీరావు.

''నేను మేనక బంగళాకు వెళ్ళాననడానికీ, హత్య చేశాననడానికీ మీకు సాక్ష్యాధారాలున్నాయి కదూ ?'' అన్నాడు శంకర్రావు.

''ఉన్నాయి-'' అన్నాడు భానోజీరావు.

''అయితే ఇంకేం-నన్నరెస్టు చేయండి. నేనే హంత కుణ్ని !" అన్నాడు శంకర్రావు.

ముగ్గురూ తెల్లబోయారు. ధర్మారావు కంగారుగా - "ఒరేయ్ శంకరం-నువ్వేం మాట్లాడుతున్నావో, ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా ? ఒక పోలీస్ ఇన్‌స్పెక్టరు ముందు అనాలోచితంగా నేరస్తుణ్ణని అన్నావంటే నీ పీకకు చుట్టుకునేది ఉరితాడేరా-" అన్నాడు.

'' తిరుగులేని ఆధారాలున్నపుడు ఏం చెప్పి నన్ను రక్షించుకో గలను ? ఇందులో ఆలోచించాల్సినదేముంది? నేనే హంతకుణ్ని !'' అన్నాడు శంకర్రావు.

''భానోజీరావుగారూ - వాడి మాటలు నమ్మకండి - వాటం చూస్తుంటే వీడికి మతి పోయినట్లుంది-" అన్నాడు ధర్మారావు కంగారుగా.

''మీ తమ్ముడికి మతి పోలేదు ధర్మారావు గారూ— చాలా తెలివిగా ప్రవర్తిస్తున్నాడు. ఇతను తప్పక హంతకుడే నని నాకు నమ్మకంఏర్పడుతోంది. మీలాంటి వారికిటువంటి తమ్ముడుంటాడని నేనూహించలేదు"-అన్నాడు భానోజీ

రావు.

"ఒకేమ్-నువ్వు హంతకుడివే అయితే ఈ హత్య ఎందుకు చేశావో చెప్పు..." అన్నాడు ధర్మారావు దీనంగా. అతనింకా ఈ నిజాన్ని తట్టుకోలేక పోతున్నాడు.

"చెబితే శిక్ష తగ్గిస్తారా?" అన్నాడు శంకర్రావు చిరాగ్గా.

"తగ్గించినా తగ్గించక పోయినా చెప్పక తప్పదు...." అన్నాడు భానోజీరావు.

శంకర్రావు గొంతు సవరించుకుని - "గత అయిదు సంవత్సరాలుగా నేను చేస్తున్న వ్యాపారంలో భాగస్థుడు సుందరయ్య. అతన్ని నేను పూర్తిగా నమ్మాను. వ్యాపారం బాగానే నడుస్తున్నదనుకున్నాను. ఎప్పటి కప్పుడు నష్టం చూపిస్తూ వచ్చాడు సుందరయ్య. వాడి పరిస్థితి కూడా మరీ అంత మెరుగ్గా లేకపోవడం వల్ల నేను వాడి మాటలు నమ్మాను. నూనెలు, పప్పులు, ధాన్యాలు, పళ్ళు-టోకున కొని లారీలో ఇతర రాష్ట్రా లకు ఎగుమతి చేస్తుండేవాళ్ళం మేము. ఎప్పటికో అప్ప టికి ఈ వ్యాపారం మమ్మల్ని గొప్పవాళ్ళని చేస్తుందను కున్నాం.

నలభై వేలకు ఓ స్వంతలారీ కొన్నాం. అది సెకండ్ హేండ్ దే కానీ బండికొత్తగానే ఉంది. పదివేలు ముందు కట్టి మిగతాడబ్బు వాయిదాల పద్ధతిమీద కట్టాలనుకున్నాం. కానీ ప్రయాణంలో దుండగుల దాడి వల్ల ఆ లారీ దగ్ధమై పోయింది. ఆ లారీ పోయింది.

దాన్ని గురించి కట్టాల్సిన ముప్పైవేల బాకీ అలాగే ఉండిపోయింది. ఇన్సూరెన్సు కంపెనీ నుంచి నష్టం

రాబడదామని నేను సుందరయ్యతో అన్నాను. అప్పుడు వాడు - అది దొంగలారీ అనీ అందుకే నలభై వేలకు కొనగలిగామనీ చెప్పాడు. నా గుండె ఆగిపోయింది. నన్ను దిగులు ఆవహించింది. సుందరయ్యను పూర్తిగా నమ్మితే, వాడిమీద ఆధారపడితే - నేనింకా సర్వనాశనమై పోతాననిపించింది. లారీబాకీ తీర్చడానికి మా ఇద్దరిదగ్గరా డబ్బులేదు. నేను అన్నయ్యనడిగితే ఇస్తాడు కానీ ఈ తెలివితక్కువ తనానికి అంతమేమిటి? ఈ విషయంలో బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావాలనుకున్నాను.

ఈలోగా అనుకోకుండా ఒకరోజున రోడ్డుమీద ఒక అమ్మాయిని కారు క్రింద పడకుండా రక్షించాను. ఆమె పేరు మేనక అని చెప్పింది. ఊళ్ళో పేరుకెక్కిన కాబరే నర్తకి మేనక ఆమెయే। ఆమె నాగురించి వివరాలడిగి తెలుసుకుని సుందరయ్య భాగస్థుణ్నని తెలియగానే ముక్కుమీద వేలేసుకుంది. ఆ జూదగాడితో కలిసి వ్యాపారానికెందుకు దిగారని దెబ్బలాడింది. ఆమె చెప్పిందాన్ని బట్టి చూస్తే సుందరయ్య రహస్యపరుడు. వేలకు వేలు క్లబ్బుల్లో తగలేస్తాడు. అకారణంగానే అతనిఇల్లా ఇల్లాలూ ఇబ్బందుల్లో ఉండడం జరుగుతోంది.

ఆమె చెబుతున్న వన్నీ నిజాలని తెలుసుకుంటానికి నాకెంతో కాలం పట్టలేదు. వ్యాపారంలో బ్రహ్మాండమైన లాభాలు వస్తూంటే వాటని తనవ్యసనాలకుపయోగించుకొంటూ నష్టం వచ్చిందని నన్నుమోసం చేస్తున్నాడు. అసలికి లారీవ్యవహారం కావడంకూడా అబద్ధమే। అదివాడు లాభానికి ఇంకొకరికి అమ్మేసుకొని నాతో అలా చెప్పాడు. ఇందులో తప్పంతా నాదే। ఒక్క విషయం

కూడ పట్టించుకోకుండా నేను అంతా సుందరయ్యకు వదలి పెట్టాను. అందుకు నాకు తగినశాస్తి జరిగింది. అందుకే నేనువా ణ్ణిక్క చంపేశాను"..అన్నాడుశంకర్రావు.

ఈ కథను అక్కడున్న ముగ్గురు ఎంతో ఆసక్తిగా విన్నారు. తమ్ముడి ముగింపు వాక్యం మాత్రం ధర్మారావుకు నచ్చలేదు 'అబద్ధమాడకు. నువ్వువాణ్ణి చంపలేదు. హత్య చేయడం నీ వల్ల కాదు.' అన్నాడు గట్టిగా।

"నా మీద నీకున్న నమ్మకానికి థ్యాంక్సన్నయ్యా. నన్ను ఇంత ఉరితీసినా నాకు బెంగ లేదు." అన్నాడు శంకర్రావు.

"నీ కథ బాగానే ఉంది కానీ నువ్వు సుందరయ్యను మేనక బంగళాలో ఎందుకు హత్య చేశావ్?" అన్నాడు భానోజీరావు.

"సుందరయ్య మేనకకు కస్టమర్. అతని నుంచి ఆమె చాలా డబ్బు సంపాదించింది. నేనేమో మేనక ప్రాణాలు రక్షించిన వాణ్ని. మా ఇద్దరికీ మేనక సామరస్యం కుదుర్చుతానన్నది. ఆమె చెప్పిన సమయానికి నేనా ఇంటికి వెళ్ళాను. తలుపులు బార్లాతీసి ఉన్నాయి......."

ధర్మారావు మధ్యలో కలగజేసుకుని- "అప్పటికే అక్కడ సుందరయ్య చచ్చిపడి ఉన్నాడు. ఆ దృశ్యం చూసి కంగారుపడి నువ్వక్కణ్నించి బయటకు వచ్చేశావు. అవునా?" అన్నాడు.

"లేదు అక్కడ సుందరయ్య ఉన్నాడు. వాడికీ నాకూ మాటామాటా పెరిగింది. గొడవయింది. ఆవేశంతో నేను అక్కడ అందుబాటులో ఉన్న కత్తి తీసుకుని వాడి

గుండెల్లో పొడిచేశాను....." అన్నాడు శంకర్రావు.

"అబద్ధం-" అన్నాడు ధర్మారావు.

"సారీ అన్నయ్యా! ఇదే నిజం-" అన్నాడు శంకర్రావు.

"ఇతను నిజమే చెబుతున్నాడు. అక్కడ చాలా ప్రాంతాల్లో ఇతని వేలిముద్రలున్నాయి-" అన్నాడు భానోజీరావు. తర్వాత నెమ్మదిగా-"అయితే హత్యాయుధా న్నేంచేశావ్?" అన్నాడు.

"అన్ రిజిస్టర్డ్ పార్సిల్ క్రింద నోటికొచ్చిన పేరు రాసి లక్నోకు పోస్టు చేశాను...."

"లక్నోకా! అక్కడెవరున్నారు?" అన్నాడు భానోజీ రావు ఆశ్చర్యంగా.

"ఎవరో ఉన్నారని కాదు. ఏమైనా దూరప్రాంతాలకు పంపాలనిపించింది. ఆ సమయంలో లక్నో పేరు గుర్తు కొచ్చింది. రాశాను. లక్నోలో నవాబు లెక్కువుంటారని విన్నాను. అందుకని నవాబ్ సయ్యద్ ఆలీ అని నోటి కొచ్చిన పేరు కూడా రాశాను. అడ్రసులో తోచిన ఇంటి నంబర్ వేసి ముంతాజ్ బేగం స్ట్రీట్ అని రాశాను...." అన్నాడు శంకర్రావు.

ధర్మారావు ఆశ్చర్యంగా తమ్ముడి వంక చూస్తు న్నాడు. శంకర్రావు అంత నిబ్బరంగా ఎలా మాట్లాడ గలుగుతున్నాడో అతనికి అర్థం కాలేదు.

"మిస్టర్ శంకర్రావ్! నీ గుండెనిబ్బ రాన్ని అభి నందించకుండా ఉండలేను కానీ-ఇది వాస్తవ జీవితమని గుర్తుచేయకుండా ఉండలేక పోతున్నాను. ఏదో పాత్రను నటిస్తున్నట్లు చాలా ధైర్యంగా ఉన్నావు. మరి కాసేపట్లో నీ చేతులకు బేడీలు పడతాయి ...." అన్నాడు

భానోజీరావు.

శంకర్రావు తడబడి-"ఇది గుండె విబ్బరం కాదు సార్! అరే ముందు వెలుగుతున్న దీవపు వెలుగు. మేక పోతు గాంభీర్యం-"అన్నాడు.

"మేనక పిలవగా వెళ్ళావ్ గదా-మేనకను కలుసుకోలేదా?" అన్నాడు భానోజీరావు.

"ఇంకెక్కడి మేనక ?- ఆమె హత్య చేయబడిందిగా?"- అన్నాడు శంకర్రావు.

"మేనక హత్య చేయబడిందా?"- ఉలిక్కిపడి అడిగాడు భానోజీరావు.

"సుందరయ్యను నేను చంపడానికి అదే కారణం. వాడు తనే మేనకను చంపేశానని చెప్పాడు. తన సంగతి ఆమె నాకు చెప్పేసిందని వాడికి వళ్ళు మండిపోయిందట. ఆ ఆవేశంలో ఆమెను ఎలా చిత్రహింసలు పెట్టి చంపాడో చెబుతూంటే నాకు వీరావేశం వచ్చింది. ఆఊపులో వాణ్ని చంపేశాను"

భానోజీరావు ఆశ్చర్యంగా-"ఇదో కొత్త విషయం-ఇంకో హత్య సంగతి తెలిసింది. సుందరయ్యా నువ్వుగానీ ఇంకేమైనా హత్యలు చేశారా?" అన్నాడు.

"నేవింకేమీ హత్యలు చేయలేదుకానీ సుందరయ్య మాత్రం మాటల సందర్భంలో తను మేనకనే కాక ఆమెప్రియుడు హ ర నా ధ్ ను కూ డా చంపేశానని అన్నాడు...." అన్నాడు శంకర్రావు.

"హరనాథ్ ఎవరు ?" అన్నాడు భానోజీరావు కంగారుగా. హఠాత్తుగా కేసు కొత్తపుంతలు తొక్కుతున్నదని అతనికి అనిపించింది.

"నాకూ తెలియదు. సుందరయ్య చెప్పిందాన్ని బట్టి మేనక ప్రియుడని తెలుస్తోంది-వాళ్ళిద్దరినీ ఎక్కడ చంపే శాడో కూడా నాకు తెలియదు.-"

"మిస్టర్ శంకర్రావ్! నువ్వు జరిగిన విశేషం సక్ర మంగా చెప్పడంలేదు. నిన్నరెస్ట్ చేసి లాకప్‌లో పెట్టి, అసలు కథంతా చెప్పించాల్సొచ్చేలా ఉంది-" అన్నాడు భానోజీరావు.

"అయ్యా-నేను రచయితనుకాదు. తెలివైనవాణ్ని కాదు. మీరడిగిన ప్రశ్నలకు నాకు చేతనైనంతలో జవాబు లిచ్చాను. ఇప్పుడు చెప్పిందానికి మించి ఇంకేమీ నాకు తెలియదు...." అన్నాడు శంకర్రావు.

"భానోజీరావు! ఇతంతా రహస్య పరిశోధన. శంక ర్రావును అప్పుడే అరెస్ట్ చేయరు. అతన్ని బెయిల్‌మీద విడుదల చేశాననుకో-నేను నీకు హామీ!" అన్నాడు రమణమూర్తి.

"నేనుకూడా!" అన్నాడు ధర్మారావు.

'ఇంతవరకూ ఇది ఉత్తుత్తి కేసులాగే ఉంది-'' అన్నాడు భానోజీరావు.

ఆనాటికి విచారణ అక్కడితో ముగిసింది.

6

"ఎవరండీ మీరు?" అన్నాడు భానోజీరావు.

"మేనక బంగళాలో హత్య జరిగింది కాదండీ-ఆ హంతకి బంధువునండి-" అన్నాడా ఆగంతకుడు.

భానోజీరావు ఉలిక్కిపడి-"ఇన్నాళ్ళు ఏంచేస్తున్నారు?

హంతుడెవరో తెలియక కొట్టుకు చస్తున్నాం మేము-" అన్నాడు.

"నేనూ ళ్ళో లేనండి. ఈవేళే విషయం తెలిసి ఈ కేసు మీరు పరిశోధిస్తున్నారని తెలిసి ఇలా వచ్చానండి-" అన్నాడు ఆగంతకుడు.

"మీ పేరు ?"

"కృష్ణయ్యండి-" అన్నాడు ఆగంతకుడు.

"కృష్ణయ్యగారూ-హంతుడి గురించీ, అతడికీ మీకూ గల సంబంధం గురించీ ఒక్కముక్క పొల్లుపోకుండా నాకు చెప్పగలరా ?"

కృష్ణయ్య గొంతు సవరించుకుని-"హంతుడు భైరవ మూర్తి నాకు బాగా కావలసిన వాడండి"-అన్నాడు.

భానోజీరావు ఉలిక్కిపడి-"హంతుడి పేరేమిటన్నారు?" అన్నాడు.

"భైరవమూర్తి !" అన్నాడు కృష్ణయ్య.

"మై గాడ్ !" అనుకున్నాడు భానోజీరావు.కృష్ణయ్య చెప్పింది మరో హంతుడి గురించి కాదు గదా అని అత నికి అనుమానం వచ్చింది.

అయితే ఆ అనుమానం సరైనది కాదు. కృష్ణయ్య హంతుడి ఫోటోలను గుర్తు పట్టడమే కాక - హంతుడితో పాటు తను తీయించుకున్న కొన్ని ఫోటోలు కూడా తీసుకుని వచ్చాడు.

"సరే-మీ బంధుత్వం గురించి వివరంగా చెప్పండి-" అన్నాడు భానోజీరావు.

"చిన్న తనంలోనే భైరవమూర్తికి తల్లీ తండ్రీ పోయారు. నేను ఊళ్ళో దస్తావేజులు రాసి, వ్యవహ

రాలు చేసిపెట్టి మాట మంచితనంతో బ్రతుకుతున్నాను. వాడిని చేరదీసి చదువు చెప్పించాను. మా వూరి మునసబు గారి దగ్గర వాడి పై చదువుకోసం అప్పుకూడా చేశాను. వాడు పట్నంవెళ్ళి సంపాదన మొదలు పెట్టి వాడిగురించి నాకు అయిన అప్పులన్నీ తీర్చేశాడు.

నేను ఆజన్మ బ్రహ్మచారిని. ఓ రెండు సంవత్సరాల నుంచి వాడితో పాటే ఉంటున్నాను. చిన్నపట్నించీ నావంట నేనే చేసుకోవడం అలవాటు. భైరవమూర్తికి నేను వంటచేస్తూ, వ్యవహారాలన్నీ చూసిపెడుతూ తోడుగా ఉంటున్నాను. పది రోజుల క్రితం నేను ఊరికి వెళ్ళాను. తిరిగి వచ్చేసరికి ఈ ఘోరం జరిగిపోయింది." అంటూ కళ్ళు తుడుచుకున్నాడు కృష్ణయ్య.

"ఈ ఘోరం గురించి మీ కెలా తెలిసింది?"

"ఇంట్లో పాత పేపర్లు పడిఉన్నాయి. వాటిలో రెండింట్లో మొదటి పేజీలో గుర్తుతెలియని శవం - అని భైరవ మూర్తి ఫోటో వేశారు. వెంటనే గుర్తు పట్టాను. కాళ్ళూ చేతులు ఆడలేదు. కాసేపటికి గుండె రాయి చేసుకుని వివరాలన్నీ చదివి మీ దగ్గరకు వచ్చాను...."

"చాలా మంచిపని చేశారు. భైరవమూర్తికి శంకర్రావు అనబడే మనిషితో పరిచయముందా ?"

"ఏమోబాబూ - నాకు వాడి స్నేహితులెవరూ తెలియదు. వాణ్ని మా వీధిలో వాళ్ళే చాలామంది ఎరుగరు. ఉదయం పోయి - ఎప్పుడో రాత్రి సమయంలో వస్తుంటాడు-"

ఖానోజీరావు సాలోచనగా తల పంకించి - "అసలు మీ వాడు ఏం చేస్తున్నాడు ?"-అన్నాడు.

"అదేం ఉద్యోగమో తెలియదు బాబూ-కానీ బాగా సంపాదిస్తున్నాడు. తను ప్రమాదకరమైన పనులు చేస్తున్నాడనీ, ఏ క్షణంలోనైనా ప్రాణం పోయే అవకాశమున్నదనీ తరచు అంటూండేవాడు. వాడికి ఎక్కడెక్కడ ఏమేం అకౌంట్లున్నాయో తెలియదు కానీ నా పేరున బ్యాంకులో మూడులక్షలదాకా వేశాడు-''

''ఏంచేస్తున్నావని మీరెప్పుడూ నిలదీసి అడగలేదా?"

"లేదు బాబు- వాడూ నేనూ కలిసి మాట్లాడుకునే అవకాశమే తక్కువ. ఎప్పుడైనా అడిగినా వాడు మాట తప్పించేసేవాడు-" అన్నాడు కృష్ణయ్య.

"కృష్ణయ్య గారూ- మీవాడికి సుందరయ్య అనే మరో పేరుందా?" అన్నాడు భానోజీరావు ఇంకా ఏదో ఆలోచిస్తూనే.

"భైరవమూర్తి ఒక్కటే వాడికున్న పేరు-" అన్నాడు కృష్ణయ్య.

భానోజీరావు నిట్టూర్చాడు. ఈ కేసు స్వరూప స్వభావాలు అంతుబట్టడంలేదు. శంకర్రావు చెప్పిన కథలో నిర్లక్ష్యం, హేళన అగబడుతున్నాయి. హంతకుడుగా నిరూపించబడతానన్న భయం అతనిలో గోచరించడం లేదు. పోనీ అతను అబద్ధం చెప్పాడా అనుకుందామంటే- అక్కడికి అతని వేలిముద్రలెలా వచ్చాయి? నిజం చెప్పాడనుకుందామంటే- సుందరయ్య, భైరవమూర్తి- ఒక్కరే అనుకోవాలి!

"మీరిక వెళ్ళవచ్చు...." అన్నాడు భానోజీరావు.

"భానోజీరావుగారూ - మీరు ఎలాగో హంతకుణ్ని పట్టుకోవాలి. జీవితంపై నాకున్న మమకారానికి కారణం

భైరవమూర్తి ఒక్కడే. ఈ ప్రపంచంలో నాకింకెవ్వరూ లేరు. భైరవమూర్తిని చంపినవాడు ఉరికంబం ఎక్కేవరకూ నాకు మనశ్శాంతి లేదు....” అన్నాడు కృష్ణయ్య.

భానోజీరావు కళ్ళముందు ధర్మారావు మెదిలాడు. ధర్మారావు ఏమీ మాట్లాడడంలేదు కానీ తన తమ్ముణ్ణి రక్షించమని అతడి కళ్ళు అర్థిస్తున్నాయి.

కృష్ణయ్య వెళ్ళిపోయాక- “రహస్య పరిశోధనే ఈ కేసును కాంప్లికేటెడ్ చేసింది. ఇంక శంకర్రావును అరెస్టుచేయక తప్పదు-” అనుకున్నాడు. అంతలోనే వివేకం అతన్ని హెచ్చరించింది. తనకు ఏ సమాచారం కావాలన్నా శంకర్రావు ఇస్తాడు. అతడి గురించి తనకు రమణమూర్తి, ధర్మారావు హామీ ఉన్నారు.

సుందరయ్య కుటుంబాన్ని కలుసుకోవాలి. శంకర్రావును ప్రశ్నించడంకంటే ఆ కుటుంబాన్ని ప్రశ్నించడం వల్లనే తనకు ఎక్కువ ప్రయోజన ముంటుంది.

భానోజీరావు మోటార్‌సైకిల్ మీద శంకర్రావు ఇంటికి వెళ్ళి సుందరయ్య ఇంటి అడ్రస్ తీసుకొన్నాడు. అక్కణ్ణించి తిన్నగా సుందరయ్య ఇంటికివెళ్ళాడు. ఇంటిముందు క్షణంఆగి నెమ్మదిగా వెళ్ళితలుపు తట్టాడు.

ముప్పై ఏళ్ళ అందమైన స్త్రీ వచ్చి తలుపుతీసింది. పోలీసు దుస్తుల్లో ఉన్న భానోజీరావును చూసి కంగారు పడి- “ఎవరి కోసమండీ?” అంది.

“సుందరయ్య గారికోసం-” అన్నాడు భానోజీరావు.

“ఆయనేమైనా తప్పు చేశారా?” అంది కంగారుగా ఆ స్త్రీ.

“మీరు సుందరయ్యగారి భార్యా!” అనడిగాడు

భానోజీరావు.

ఆమె తలాడించింది. భానోజీరావు ఆమె వంక జాలిగా చూసి- "ఆయనేమి తప్పుచేయలేదమ్మా, ఒక కేసు విషయంలో పరిశోధిస్తూ సమాచారం కోసం వచ్చాను." అన్నాడు.

"ఆయనూళ్ళోలే రండి" అంది సుందరయ్య భార్య.

"ఎప్పుడు వస్తారు?"

"బహుశా రేపు రావచ్చు-" అందామె.

"ఊరికెప్పుడు వెళ్ళారు?''

'మొన్న-" అందామె.

భానోజీరావు ఉలిక్కిపడి- "ఎ ప్పు డ న్నా రూ?" అన్నాడు.

''మొన్న!" రెట్టించిందామె.

''మైగాడ్!'' అనుకున్నాడు భానోజీరావు. ఇదెలా సాధ్యం? శంకర్రావు తను సుందరయ్యను హత్య చేశానన్నాడు. ఆహత్య తొమ్మిదిరోజుల క్రితం జరిగింది.

భానోజీరావు తన జేబులోని హతుడి ఫొటోను ఆమెకు చూపించి "ఈ ఫోటో ఎవరిదో చెప్పగలరా! అన్నాడు.

ఆమె దాన్ని పరీక్షగా చూసి "నాకు తెలియదు" అంది.

"అంటే హతుడు సుందరయ్య కాదన్నమాట'' అనుకున్నాడు భానోజీరావు. అతను సుందరయ్య భార్యనడిగి సుందరయ్య ఫోటో ఒకటి తీసుకున్నాడు. హతుడికీ, సుందరయ్యకు ఏమాత్రమూ పోలికలు లేవు.

7

"ఈ ఫోటో ఎవరిది?" భానోజీరావు తీవ్రంగా

అతిగాడు.

"సుందరయ్యది-" అన్నాడు. శంకర్రావు.

"మరి ఇతన్నేకదా నువ్వు చంపానన్నావు"

"అవును...."

"ఇతను చావలేదు. నిక్షేపంలా ఉన్నాడు..."

"హంతుడు బ్రతికాడా?" అన్నాడు శంకర్రావు ఆశ్చర్యంగా.

"మిస్టర్ శంకర్రావ్! నువ్వు చట్టంతో ఆటలాడుతున్నావ్! నువ్వుచెప్పే సమాచారం ఒక్కటీ సరిగ్గాలేదు. మేనక బంగళాలో చచ్చినవాడు సుందరయ్యకాడు. భైరవమూర్తి!" అన్నాడు భానోజీరావు.

"భైరవమూర్తా? వాడెవరో నాకు తెలియదే!" అన్నాడు శంకర్రావు.

"నీకు తెలియకుండా ఎలా ఉంటుంది? అక్కడున్న వేలిముద్రలు వాడివీ, నీవీ మాత్రమే!"

"అవేమీ నాకు తెలియదు. నేనక్కడ సుందరయ్యను కలుసుకుని దెబ్బలాడి బైటకు వచ్చేశాను. ఆతర్వాత అక్కడేదో హత్య జరిగిందని తెలిసింది. సుందరయ్యే చచ్చి ఉంటాడనుకున్నాను. మీఅనుమానం నామీదకు రాగానే మర్యాదగా ఒప్పేసుకున్నాను..."

"మిస్టర్ శంకర్రావ్! థర్డ్‌డిగ్రీ మెథడ్స్ అంటే నీకు తెలుసా?"

"తెలుసు. వాటికి భయపడే నేను హంతకుడ్ని అని ఒప్పేసుకున్నాను. వాటికంటె చావేనయం. ఇప్పుడైనా సరే-ఈకేసులో నేనెలాగు అనుమానితుడ్ని. నావేలిముద్రలు అక్కడున్నాయి. మీరేం చెప్పమంటే అలా

చెప్పేస్తాను. థర్డ్‌డిగ్రీ మెథడ్స్ గురించి మాత్రం నా దగ్గర మాట్లాడకండి-" అన్నాడు శంకర్రావు.

భానోజీరావుకు ఏడవాలో, నవ్వాలో తెలియలేదు. శంకర్రావు అమాయకుడో, అతి తెలివిపరుడో తెలియడం లేదు. అసలీకేసు ఏమిటి? హతుడు భైరవమూర్తి ఎవరు? అతనేం చేసేవాడు? మేనక బంగళాకతనెందుకు వెళ్ళాడు? అక్కడ అతన్ని ఎవరు ఎందుకు హత్య చేశాడు?

ఖచ్చితంగా అనుమానించవగ్గ మనిషి దొరికినా పై ప్రశ్నల్లో ఒక్కదానిక్కూడా సమాధానం దొరకడం లేదు. లోపం తన పరిశోధనలో ఉందా? తన మంచితనంలో ఉందా?

భానోజీరావు రమణమూర్తినీ, ధర్మారావునీ కలుసుకుని మాట్లాడి పరిస్థితి వివరంగా చెప్పి- "మీవాడు నాకు బొత్తిగా సహకరించడంలేదు. అరెస్టు చేయక తప్పేలాగున లేదు. ఒకసారి అరెస్టు చేశానంటే వ్యవహారం నాచేయి దాటిపోతుంది. అందుకే తటపటాయిస్తున్నాను..." అన్నాడు.

"మరికాస్త గడువివ్వండి. నేను వాడిచేత నిజం కక్కిస్తాను...." అన్నాడు ధర్మారావు.

8

"హలో!" అన్నాడు భానోజీరావు.

"నేనుసార్! మేనకను మాట్లాడుతున్నాను...."

భానోజీరావు తన చెవులు తనే నమ్మలేక పోయాడు.

''ఎవరూ?'' అన్నాడు మళ్ళీ.

''నేను సార్-కాబరేడాన్సర్ మేనక-మా ఇంట్లో ఏదో హత్య జరిగించటగా - ఆ విషయంలో మీతో కొన్ని విషయాలు మాట్లాడాలనుకుంటున్నాను...రమ్మంటారా?''

''ష్యూర్. తప్పకుండా....తక్షణమే బయల్దేరిరండి-'' అన్నాడు భానోజీరావు. అవతల క్లిక్‌మన్న శబ్దం వినగానే రిసీవర్ని క్రేడిల్ చేసి తల పట్టుకున్నాడు. ఇప్పటిదాకా పని పోయిందనుకుంటున్న మేనక బ్రతికి కొచ్చింది. క్షణక్షణానికీ కేసులో మిస్టరీ పేరుకు పోతున్నది.

మేనక స్టేషన్లో అడుగు పెట్టగానే ఒక్కసారి సంచలనం కలిగింది. ఆమె వంటి నుంచి మంచి పరిమళాలు రావడం మాత్రమే కాదు, ఆమె అలంకరణ కూడా అందుకు కారణం. కాబరే నర్తకి వేషంలోనే ఆమె అక్కడకు వచ్చింది. వేసుకున్న ఉడుపుల్లోంచి ఆమె శరీరపు రంగు ఇది అని ఖచ్చితంగా చెప్పవచ్చు. పోలీస్ స్టేషన్‌కు తన వంపు సొంపులన్నీ ప్రదర్శించడానికి వచ్చిన మోడల్ గర్ల్‌లా వచ్చిందామె.

భానోజీరావు ఆమెను చూసి దృష్టి మరల్చుకోలేక పోయాడు. కళ్ళు చెదిరే అందం ఆమెది. అందులోనూ ఆ వయసు ఆడది ఆవిధంగా అవయవ ప్రదర్శన చేస్తుందని అతనూహించలేదు.

''నమస్తే!'' అంది మేనక చేతులు జోడించి. ఆమె వేషధారణ కాసంప్రదాయం నప్పలేదు.

''నమస్తే! అన్నాడు భానోజీరావు.

భానోజీరావు తాపీగా ఆమె చెప్పేవన్నీ విన్నాడు. తను

తక్కువ మాట్లాడి ఆమెను ఎక్కువమాట్లాడనిచ్చాడు.

మేనకకు భైరవమూర్తి తెలుసును. శంకర్రావు తెలుసును. సుందరయ్యకూడా తెలుసును, శంకర్రావు తనకు ప్రాణదాత అన్న విషయం మేనక అంగీకరించింది. శంకర్రావుకూ, సుందరయ్యకూ మనస్పర్థలు వచ్చాయని ఆ విషయంలో తాను సాయం చేయాలనుకున్నానని ఆమె చెప్పింది.

తన బంగళా కట్టించడానికి భైరవమూర్తి చాలా సాయం చేశాడనీ దాని రహస్యాలన్నీ అతనికి తెలుసుననీ ఆమె చెప్పింది. భైరవమూర్తి ఏం చేస్తున్నాడో తెలియదు కానీ రెండు చేతులా ఆర్జిస్తున్నాడనీ డబ్బు జల్సాగా ఖర్చుపెడతాడని ఆమె అన్నది. ఆమె చెప్పిన ప్రకారం అతను పగలాట్టే ఎవ్వరికీ కనిపించడు. అతని కార్య కలాపాలన్నీ రాత్రిళ్ళే జరుగుతుంటాయి. భైరవమూర్తికి మేనక అంటే చాలా ఇష్టం. ఆమె గురించి అతను చాలా డబ్బు ఖర్చు చేశాడు.

మేనక ఊళ్ళో ఉండని విషయం భైరవమూర్తికి తెలుసు. తన అంద చందాల కారణంగా మేనక ఆ ఊళ్ళో చాలా మంది ప్రముఖులకు పరిచితురాలు. ఆమె ఒక్కరోజు లేకపోతే కలవరపడి పోయేవారు చాలా మంది ఉన్నారు. అందువల్ల తనకు విశ్రాంతి కావాలను కున్నప్పుడల్లా మేనక బంగళాను భైరవమూర్తికి అప్ప జెప్పి తను బొంబాయి పేరు చెప్పి ఏఊటీకో, కాశ్మీర్ కో వెళ్ళి వస్తూంటుంది.

ఈ పర్యాయం ఆమె బెంగుళూర్ వెళ్ళింది. ఆమె అక్కడున్నట్లు సాక్ష్యాధారాలున్నాయి. హత్యకు సంబం

ధించినంతవరకూ ఆమెకు బలమైన ఎలిబీలున్నాయి.

భైరవమూర్తి హత్య ఎందుకు జరిగిందో, ఎవరు చేసి ఉంటారో మాత్రం మేనక చెప్పలేక పోయింది.

అంతా విని భానోజీరావు నిట్టూర్చాడు.

కేసు ఎక్కడ వేశావే గొంగళీ అన్నట్లుంది.

9

"శుభవార్త సార్ !" అన్నాడు కానిస్టేబులు రంగాచారి.

"ఏమిటది !"

"లక్నో నుంచి నవాబ్ సయ్యద్ అలీ పేరున పోస్టు చెయ్యబడ్డ పార్శిల్ సంపాదించుకు వచ్చాడు మనవాడు–" అన్నాడు రంగాచారి.

"ఈజిట్ !" అన్నాడు భానోజీరావు ఆశ్చర్యంగా. ఆ పార్శిల్ విషయంలో అతనికి నమ్మకం లేదు. శంకర్రావు చెప్పిన అనేక అబద్ధాలలో అదొకటి అనుకున్నాడు.

ఆ విషయం తనకు శంకర్రావు చెప్పినట్లు అతను రికార్డు చెయ్యలేదు. ఎవరో ఆకాశరామన్న ఫోన్ చేసి ఆ పార్శిల్ గురించి చెప్పినట్లుగా రాసుకుని–దాని విషయమై అన్వేషణ ప్రారంభించాడు. లక్నోలోని అన్ని పోస్టాఫీసులకీ ఆ పార్శిల్ గురించి తంతి పంపడం జరిగింది. తర్వాత తమ మనిషి దాని గురించి వెళ్ళాడు.

భానోజీరావు స్టేషన్‌కు వెళ్ళాడు. ఆ పార్శిల్‌ను చూశాడు. అడ్రసు శంకర్రావు చెప్పిన విధంగానే

ఉన్నది. భానోజీరావు అభినందన పూర్వకంగా అది సాధించుకు వచ్చిన మనిషివంక చూసి - జాగ్రత్తగా ఆ పార్సిల్ విప్పాడు.

అందులో ఒక కత్తి ఉన్నది. దానికి ఎండిన రక్తం ఉన్నది. ఆ కత్తి జాగ్రత్తగా పార్సిల్ చేయబడింది.

భానోజీరావు దాన్ని లాబరేటరీకి పంపించాడు. రిపోర్టు కోసం చాలా ఆత్రుతగా ఎదురు చూశాడు.

అది భైరవమూర్తిని హత్యచేయడానికి ఉపయోగించిన సాధనమే. సందేహంలేదు. దానిమీద వేలిముద్ర లున్నాయి కానీఅవి మేనకఇంట్లో లభించిన రెండింటిలోనూ సరిపోలేదు. ఇవి మరోవ్యక్తివి!

ఎవరావ్యక్తి ?

భానోజీరావు ఆత్రుతగా తనకు అనుమానం ఉన్న వాళ్ళందరి వేలిముద్రలూ పరీక్షచేయించాడు. అవి ధర్మారావువి కాదు. కృష్ణయ్యవి కాదు. సుందరయ్యవి కాదు. మేనకవికాదు. మరెవరివి?

భానోజీరావు ఓపికకు అంతం సమీపించింది. తనకు అనుమానమున్న ప్రతి ఒక్కరినీ చావగొట్టి చెవులు మూసి నిజం కక్కించాలనుకున్నాడు. ఆ పనిచేసేముందు ఈ వేలిముద్రలు పాత నేరస్తులెవరిలోనైనా సరిపోతాయేమో చూడాలనుకున్నాడు. వేలిముద్రల ఫొటోలను ఏయే సంస్థలకు పంపాలో ఆదేశాలిచ్చి ఆలోచనలో పడ్డాడు భానోజీరావు.

10

"నువ్వు నిజంచెప్పకపోతే నీకళ్ళముందే మేమంతా విషంతిని చచ్చిపోతాం_" అన్నాడు ధర్మారావు.

"అన్నయ్యా_" అన్నాడు శంకర్రావు- "ఎలాచెప్పేది ఆ నిజం?"

"చెప్పద్దులే_ మా చావు కళ్ళారాచూడాలని నువ్వనుకుంటున్నావుగదా_" అందిశాంత.

'నా గురించి మీరు బెంగపెట్టుకోవద్దు. నా కేమీ ప్రమాదంలేదు. కానీ నన్నుమాత్రం నొక్కించి నిజాలు రాబట్టాలని ప్రయత్నించవద్దు. నాకు మేలు చేస్తున్నామనుకుని మీకుమీరు కీడు చేసుకున్నవారౌతారు."

"వీడితో మాట్లాడి లాభంలేదు. ముందునేను విషం మింగుతాను. ఇలాంటి తమ్ముడున్నందుకు ఇంతకు మించిన చావెలా వస్తుందిలే నాకు..." అన్నాడు ధర్మారావు.

శంకర్రావు ఏదో నిశ్చయానికి వచ్చినవాడిలా "_సరే అన్నయ్య- అన్నీ చెబుతాను. తర్వాత నీకు తోచినట్లు చేద్దువుగాని. ముందు వదిన్నీ, పిల్లలను బయటకు పంపించు_" అన్నాడు. ధర్మారావు అలాగే చేశాడు. గదిలో అన్నదమ్ము లిద్దరూ మిగిలారు.

"అతని అసలు పేరు నాకు తెలియదు. తన పేరు హరనాథ్ అనినాకు చెప్పాడు. నాకూ, సుందరయ్యకూ గొడవ వచ్చినప్పుడు మేనక మా సమస్య పరిష్కరిస్తాడని చెప్పినన్ను ఈ హరనాథ్ దగ్గరకు పంపింది. హరనాథ్‌ని నేను ఒకహోటల్లో కలుసుకున్నాను. హరనాథ్

నా కథవిని సుందరయ్యవల్ల డబ్బు పోగొట్టుకున్నందుకు నువ్వు విచారించవద్దు. నాకో చిన్నపని చేసిపెడితే, నీ సమస్య పరిష్కారం కావడమే కాకుండా నీకు లక్ష రూపాయలు వచ్చేలా చేస్తానన్నాడు. ఏమిటది అని అడిగాను.

"నువ్వో హత్యకేసులో ఇరుక్కోవాలన్నాడు. హంత కుడిగా అనుమానించ బడాలన్నాడు. ఆవిధంగా కొంత కాలం గడపాలన్నాడు. పోలీసులు ఎన్ని ప్రశ్నలు వేసినా లొంగకుండా ఎలాగో తప్పుదారి పట్టించాలన్నాడు. వారి ఆలోచనలు తప్పు మార్గాన నడిపిస్తే కొంతకాలం తర్వాత ఆటోమేటిక్‌గా నేను విడుదలై పోతానన్నాడు. అతని ఈషరతుకు నేనంగీకరించలేదు. నన్ను రకరకాలుగా బెదిరించాడు. నేను లొంగలేదు.

"చివరి అస్త్రంగా దారుణమైన మాట అన్నాడు. అదే నన్ను అతడికి కట్టుబడేలా చేసింది. నెల్లాళ్ళుగా నేను దిగులుగా ఉండటానికదే కారణం. మీతో చెప్పుకోలేని విషయంకూడా అదే-" ఆగాడు శంకర్రావు.

"ఏమిటది?"

"అతను నాకో ఫొటో చూపించి-ఈమెకు ప్రపంచంలో ఏఆడది భరించలేని, సహించలేని ఘోరావమానం చేయిస్తే-నీకెలా ఉంటుంది? అనడిగాడు. ఆఫొటో చూసి చలించిపోయాను. అది వదిన ఫొటో-" శంకర్రావు క్షణం ఆగి- "అదుర్మార్గుడు బట్టలు లేకుండా క్లబ్ డాన్సు చేయిస్తానన్నాడు. పదిమంది రౌడీ వెధవల్ని ఆమె మీదికి వదుల్తానన్నాడు. ఇంకా అనరానిమాటలు చాలా

అన్నాడు. రెండురోజులు వాడితో తిరిగాక వాడు అన్నంత పనీ చేయగల సమర్థుడని గ్రహించాను.

వాడీ ఊళ్ళోని నేరాలకు మకుటంలేని రాజు. వాడిలో ఎవరికీ ముఖాముఖీ పరిచయంలేదు. వాడి వ్యవహారాలన్నీ భైరవమూర్తి అనే వాడొకడు చూస్తున్నాడు. భైరవ మూర్తి ఊళ్ళోని ప్రముఖులందరికీ తెలుసు. కానీ తెలుసు నని ఎవ్వరూ ఒప్పుకోరు. ఊళ్ళో వాడు చట్టవిరుద్ధమైన పనులన్నీ చేస్తున్నాడు. వాడిని నడిపించేది హరనాథ్ అని ఎవ్వరికీ తెలియదు.

అతగాడి బెదిరింపుకు నేను లొంగిపోయాను. హత్య కేసులో ఇరుక్కున్నాక నన్నతడు రక్షిస్తాడో, లేదో తెలియదు. మన ఇంటి పరువుకోసం ఉరిస్కు తీసుకోవా లనుకున్నాను

అంతా నేననుకున్నట్లే జరిగింది. సమయానికి ఊళ్ళో లేకుండా కృష్ణయ్యనూ, మేనకనూ హరనాథే ఏదో ట్రిక్ చేసి పంపేసి ఉంటాడు. తను భైరవమూర్తిని హత్య చేసేశాడు. అదయ్యాక కత్తిని తీసి పార్సిలు చేశేసాడు. అవివరాలు నాకు చెప్పాడు .....” అన్నాడు శంకర్రావు.

ధర్మారావుకు ముచ్చెమటలు పోశాయి-“తమ్ముడూ-ఎంత ఘోరం జరిగిందిరా-నిన్ను తప్పుగా అర్థం చేసుకున్నాంరా.నువ్వు త్యాగమూర్తివిరా-” అన్నాడు.

“అది సరేనన్నయ్యా-హరనాథ్ గురించి తెలిసిన ఏకైక వ్యక్తి భైరవమూర్తి. అందుకే అతడివి చంపి అడ్డు తప్పించుకున్నాడు. అయితే ఏపరిస్థితుల్లోనూ నేను భైరవమూర్తిని ఎవరు ఎందుకు చంపారో చెప్పకూడదు. చెప్పానో-వదినకు ప్రమాదం తప్పదని ఖచ్చితంగా

చెప్పాడు హరనాథ్. పుందుకే ఈ అసలు కథను నేను భానోజీరావుకు చెప్పలేదు. ఈ పరిస్థితుల్లో నేనేం చేయాలో నువ్వే చెప్పు-" అన్నాడు శంకర్రావు.

సరిగ్గా అదే సమయానికి గదిలోకి భానోజీరావు అడుగుపెట్టాడు-"వెల్ మిస్టర్ శంకర్రావు. నావి పాము చేవులు. నువ్వు చెప్పిన కథంతా విన్నాను. సమయానికి రాగలగడం నా అదృష్టం. ఇంక నువ్వేమి భయపడనవసరం లేదు. నీకూ, నీ వదినకూ ఏమి భయం లేదు. హంతకుడు హరనాథ్ ఈ ఉరికేకాదు - ప్రపంచానికే ముప్పు తేగలవాడు. అతను ఇంటర్నేషనల్ స్మగ్లర్. తను బయటపడకుండా భైరవమూర్తిని అడ్డుపెట్టుకుని ఘోరమైన నేరాలు చేశాడు. చివర్లో ఆ భైరవమూర్తినే అంతం చేసి అంతులేని సంపదకు ఏకైక వారసుడై తను స్విట్జర్లాండ్ వెళ్ళిపోతూ తనగురించి ఆలోచించే అవకాశమైనా లేకుండా మాకు చేయడం కోసం హత్యకేసులో విన్నిరికించి ముప్పు తిప్పలు పెట్టాడు మమ్మల్ని. మా రికార్డుల్లోకి నీ పేరు రానివ్వను. ప్రస్తుతానికి వాణ్ని మేమేమీ చేయలేము. కానీ ఎప్పుడో ఒకప్పుడు వాడి పాపం పండక మానదు.''

"అంతా వినేశారా మీరు?'' అన్నాడు శంకర్రావు.

'విన్నాను కానీ విన్నది విన్నట్లే మరచిపోతాను. సరేనా? నేను హరనాథ్ గురించి వాకబు చేయగా అతగాడు పాత నేరస్థుడని, చాలా కాలంగా ఈ ఊళ్ళోనే ఉంటున్నాడనీ తెలిసింది. అన్ని ఎయిర్‌పోర్ట్స్ లోనూ ఎంక్వయిరీ చేయగా వారుముందుగా జర్మనీ అక్కడ్నించి స్విట్జర్లాండ్ వెళ్ళాడని తెలిసింది. ఇదంతా ఎలా జరిగిందో తెలుసు

కుందామని మీ ఇంటికి వస్తే నీ కథ వినిపించింది. అసలు జరిగిందేమిటో తెలిసింది."

అని భానోజీరావు క్షణం ఆగి "మన దేశంలోని పేదరికం, సెంటిమెంట్సు దేశప్రగతి కంటె నేరస్థులకు ఎక్కువగా సహకరిస్తున్నాయనిపిస్తోంది నాకు. ఏమంటారు ధర్మారావు గారూ?" అన్నాడు.

ధర్మారావు తమ్ముడి మంచితనం గురించి ఆలోచిస్తు న్నాడు.

"ఏమనడానికి ఏముంది? చదరంగంలో సలహా ఇచ్చే ముందు కాస్త ముందు వెనక ఆలోచించాలంటాను....." అన్నాడు ధర్మారావు.

అవునుమరి........ జీవితంకూడా చదరంగం వంటిదే. అంతరంగిక విషయాలు చర్చించేముందు ఎదుట ఉన్న మనుషుల పూర్వాపరాలు తెలుసుకుంటూ ఉండాలి.

(ఐపోయింది)